నమస్తే తెలంగాణ

రంగారెడ్డి

I హైదరాబాద్, గురువారం 30 మే 2024 RANGAREDDY


# గ్రూప్-1ను పకడ్బందీగా నిర్వహించాలి



కలెక్టర్ శశాంక

రంగారెడ్డి, మే 29 (నమస్తే తెలంగాణ) : జూన్ 9న నిర్వహిస్తున్న గ్రూప్-1 ప్రిలిమినరీ పరీక్షను తెలంగాణ రాష్ట్ర పబ్లిక్ సర్వీస్ కమిషన్ ఆదేశాలను అనుసరించి పకడ్బందీగా నిర్వహించాలని రంగారెడ్డి కలెక్టర్ శశాంక అన్నారు. బుధవారం సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయ భవనంలోని సమావేశ మందిరంలో జిల్లా అదనపు కలెక్టర్ ప్రతిమాసింగ్, అధికారులతో కలిసి నిర్వహించిన సమావేశంలో కలెక్టర్ మాట్లాడారు. మొదటి సారిగా బయో మెట్రిక్ పద్ధతిన పరీక్షలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. జిల్లావ్యాప్తంగా ఏర్పాటు చేస్తున్న 93 సెంటర్లలో 55,692 మంది గ్రూప్-1 పరీక్షకు హాజరవుతున్నట్లు చెప్పారు. అభ్యర్థులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా చర్యలు తీసుకోవాలన్నారు. అభ్యర్థుల బయోమెట్రిక్ వెరిఫికేషన్ క్షుణ్ణంగా పరిశీలించాలన్నారు. సెల్ ఫోన్, ఎలక్ట్రానిక్ వస్తువులకు అనుమతి లేదన్నారు. డిపార్ట్‌మెంటల్ అధికారులు పరీక్ష రోజున ఉదయం 8 గంటలకే కేంద్రాలకు చేరుకోవాలన్నారు. సమావేశంలో రీజినల్ కోఆర్డినేటర్లు, డిపార్ట్‌మెంటల్ అధికారులు, ఫ్లయింగ్ స్క్వాడ్, సూపరింటెండెంట్లు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న బీఆర్ఎస్ పార్టీ రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు మంచిరెడ్డి కిషన్‌రెడ్డి

# ప్రైవేట్ మార్కెట్‌కు ధాన్యం..



- ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లో అంతంత మాత్రంగానే విక్రయం
- తేమ శాతం, తరుగు అంటూ కొర్రీలు పెడుతున్న కేంద్రాల నిర్వాహకులు
- వ్యాపారులు, దళారుల వైపు రైతన్నల మొగ్గు
- ప్రభుత్వ మద్దతు ధరకంటే ఎక్కువగా డబ్బుల చెల్లింపు
- యాసంగిలో వికారాబాద్ జిల్లాలో 1.19 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం వస్తుందని పౌరసరఫరాల శాఖ అంచనా
- ఇప్పటి వరకు 34,876 మెట్రిక్ టన్నుల ధాన్యమే సేకరణ
- జిల్లాలో 129 ప్రభుత్వ కొనుగోలు కేంద్రాలు..
- ఇప్పటికే మూతపడ్డవి 30
- మిగిలిన వాటినీ మూసేసే ఆలోచనలో అధికారులు

వికారాబాద్, మే 29 (నమస్తే తెలంగాణ) : జిల్లాలో ధాన్యం ప్రైవేట్ మార్కెట్‌కు తరలుతున్నది. రైతులకు మద్దతు ధర అందించేందుకు ప్రభుత్వం కొనుగోలు కేం ద్రాలను ఏర్పాటు చేసినా..అక్కడ పెడుతున్న కొర్రీలు..జరుగుతున్న నష్టంతో అన్నదాతలు దళారులు, వ్యాపారుల వైపు చూస్తున్నారు. తరుగు పేరిట కిలోల కొద్దీ ధాన్యాన్ని తీయడం.. తేమ శాతం అధికంగా ఉందంటూ తక్కువ ధరకు కొంటుండ డం.. ప్రైవేట్ వ్యాపారులు కొనుగోలు కేంద్రాల్లో ఇస్తున్న మద్దతు ధర కంటే ఎక్కువ మొత్తాన్ని చెల్లిస్తుండడంతో రైతులు వారికే విక్రయిస్తున్నారు. కొనుగోలు కేంద్రాల్లో జరుగుతున్న అవకతవకలను జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారులు పట్టించుకోకపోవడంతో ఆ నిర్వాహకులు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు. దీంతో జిల్లాలోని మెజార్టీ రైతులంతా ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లో కాకుండా ప్రైవేట్ మార్కెట్‌లోనే ధాన్యాన్ని విక్రయిస్తున్నారు. అదేవిధంగా వ్యాపారులు, దళారులు మద్దతు ధర కం టే రూ.100-200 అధికంగా ఇచ్చి ధాన్యాన్ని కొంటుండడంతో రైతులంతా ప్రైవేట్ మార్కెట్‌వైపు వెళ్తున్నారు. దీంతో కొనుగోలు కేంద్రాలకు ధాన్యం రాకపోవడంతో జిల్లాలోని కొనుగోలు కేంద్రాలు మూతపడుతున్నాయి. వికారాబాద్ జిల్లాలో 129 ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయగా, ఇప్పటికే 30 మూతపడగా.. మరో వారం, పది రోజుల్లో మిగతా కొనుగోలు కేంద్రాలను కూడా మూసేసే ఆలోచనలో సంబంధిత శాఖ అధికారులు ఉన్నట్లు సమాచారం.

## కేవలం 34 వేల మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరణ..

జిల్లాలో ధాన్యం పండించిన రైతులంతా దళారులు, వ్యాపారులకు విక్రయిస్తుండడంతో ప్రభుత్వ కొనుగోలు కేంద్రాలకు ధాన్యం అంతంత మాత్రంగానే వస్తున్నది. ధాన్యం కొనుగోళ్ల ప్రక్రియ చివరి దశకు రాగా.. ఇప్పటివరకు కేవలం 34,876 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని మాత్రమే ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల ద్వారా సేకరించారు. అయితే జిల్లావ్యాప్తంగా యాసంగి సీజన్‌లో 1.19 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం ప్రభుత్వ కొనుగోలు కేంద్రాలకు వస్తుందని అధికారులు అంచనా వేయగా, కొనుగోలు కేంద్రాల్లో చేస్తున్న మోసాలతో నిర్దేశించిన లక్ష్యంలో కనీసం 50 శాతం కూడా రాకపోవడం గమనార్హం. మరోవైపు ధాన్యం విక్రయించిన రైతులకు ఇబ్బందులు తప్పడంలేదు. రెండు, మూడు రోజుల్లో చెల్లింపులు పూర్తి చేస్తామం టూ ప్రభుత్వం ప్రకటించినా పది, పదిహేను రోజులు దాటినా సంబంధిత డబ్బులు అన్నదాతల బ్యాంకు ఖాతాల్లో జమ కావడంలేదు. దీంతో రైతులు ఇబ్బంది పడు తున్నారు. ధాన్యాన్ని సేకరించిన అనంతరం వెంటనే బిల్లులు చేయాల్సిన కొనుగోలు కేంద్రాల సిబ్బంది నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుండడంతో రైతులకు చెల్లింపుల్లో జాప్యం జరుగుతున్నట్లు సమాచారం. ఇప్పటివరకు రూ.76.83 కోట్ల విలువైన ధాన్యాన్ని రైతుల నుంచి సేకరించిన జిల్లా పౌరసరఫరాల శాఖ ఇప్పటివరకు కేవలం రూ. 22. 36 కోట్ల చెల్లింపులు మాత్రమే రైతుల ఖాతాల్లో జమ చేసింది. మిగతా సుమారు రూ.38కోట్ల చెల్లింపులు పెండింగ్‌లో ఉండడంతో అన్నదాతలు ఇబ్బంది పడుతూ.. కొనుగోలు కేంద్రాల చుట్టూ ప్రదక్షిణలు చేస్తూ.. డబ్బులు ఎప్పుడు వస్తాయని అక్కడి సిబ్బందిని అడుగుతున్నారు. కాగా యాసంగి సీజన్‌లో క్వింటా వరి ధా న్యం ఏ గ్రేడ్ రకానికి రూ.2203, సాధారణ రకానికి రూ.2183 మద్దతు ధరను ప్రభుత్వం చెల్లిస్తున్నది.





భూసేకరణ పేరిట

# రైతులను వేధిస్తే ఊరుకోం..

- బీఆర్ఎస్ పార్టీ రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు మంచిరెడ్డి కిషన్‌రెడ్డి
- రిక్రియేషన్ జోన్ రైతులతో మీటింగ్
- పార్టీ అండగా ఉంటుందని హామీ

ఇబ్రహీంపట్నం, మే 29 : రిక్రియేషన్ జోన్ పేరిట బలవంతంగా రైతుల నుంచి భూములను తీసుకునేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం కుట్రలు పన్నుతున్నదని.. రైతులను వేధిస్తే చూస్తూ ఊరుకోమని బీఆర్ఎస్ పార్టీ రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు మంచిరెడ్డి కిషన్‌రెడ్డి ప్రభుత్వాన్ని హెచ్చరించారు. బుధవారం ఇబ్రహీంపట్నం బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో హెచ్ఎండీఏ ద్వారా ల్యాండ్ పూలింగ్ చేయతలపెట్టిన ఇబ్రహీంపట్నం, శేరిగూడ, ఉప్పరిగూడ, కప్పాడు, పోచారం, తుర్కగూడ, చర్లపటేల్‌గూడ, కర్ణంగూడ గ్రామాలకు చెందిన రైతులు, రైతు నాయకులతో ఆయన సమావేశమయ్యారు. ఈ సందర్భంగా మంచిరెడ్డి మాట్లాడుతూ లేక్ డెవలప్‌మెంట్, రిక్రియేషన్ జోన్ల పేరిట ఎనిమిది గ్రామాల్లో పచ్చని పంట పొలాలను సేకరించేందుకు జరుగుతున్న కుట్రలను తిప్పికొడుతామని స్పష్టం చేశారు. శాసనసభ ఎన్నికలకు ముందు రైతుల నుంచి భూములను సేకరించొద్దని చెప్పిన కాంగ్రెస్ నాయకులు నేడు దొడ్డిదారిలో రైతుల భూములను గుంజుకునే ప్రయత్నాలు చేయటమేంటని మండిపడ్డారు. హెచ్ఎండీఏ అధికారులు గ్రామాల్లోకి వచ్చి అసైన్డ్ భూములకు ఎక రానికి 600 గజాలు, పట్టా భూములకు ఎకరానికి 1740 గజాల చొప్పున ప్లాట్లు ఇస్తామని.. భూములు రాసి ఇవ్వాలని తీవ్ర ఒత్తిడి చేస్తున్నారని రైతులు మాజీ ఎమ్మెల్యే కిషన్‌రెడ్డి దృష్టికి తీసుకురాగా.. రియల్ ఎస్టేట్ వ్యాపారం కోసం పంటపొ లాలను తీసుకోవడం ఏమిటని.. ఎట్టి పరిస్థితుల్లోనూ అధికారులకు అంగీకార పత్రాలు ఇవ్వొద్దని.. మీకు అండగా బీఆర్ఎస్ పార్టీ పోరాటం చేస్తుందని ఆయన భరోసా ఇచ్చారు. గ్రామాల వారీగా సమావేశాలు ఏర్పాటు చేసి రైతులను సంఘటితం చేయాలని రైతు నాయకులకు సూచించారు.

త్వరలోనే ఎనిమిది గ్రామాల రైతులతో సమావేశమై ప్రభుత్వ కుట్రలపై పోరాటానికి శ్రీకారం చుడతానని హామీ ఇచ్చారు. హైదరాబాద్ తూర్పు ప్రాంతానికి అవసరమైన కూరగాయలను ఈ గ్రామాల రైతులు పండించి సరఫరా చేస్తారని.. అలాంటి భూములను కాజేసేందుకు ప్రభుత్వం యత్నించడం సిగ్గుచేటన్నారు. సమావేశంలో గ్రంథాలయ సంస్థ మాజీ జిల్లా చైర్మన్ సత్తువెంకటరమణారెడ్డి, మున్సిపల్ మాజీ చైర్మన్ యాదగిరి, సర్పంచ్‌ల సంఘం మాజీ జిల్లా అధ్యక్షుడు రాంరెడ్డి, ఎంపీటీసీల ఫోరం మండలాధ్యక్షుడు భరత్‌రెడ్డి, మండల పార్టీ అధ్యక్షుడు బుగ్గరాములు, మున్సిపల్ అధ్యక్షుడు వెంకట్‌రెడ్డి, అంజిరెడ్డి, జిల్లా సభ్యుడు మోహన్‌రెడ్డి, నాయకులు గీతారాంరెడ్డి, గణేశ్, పవిత్ర, శ్రీనివాస్‌రెడ్డి, బీరప్ప, భరత్‌కుమార్, సురేశ్, శంకర్, ప్రభాకర్‌రెడ్డి, జలంధర్, వీరయ్య, సుధాకర్, నరేందర్, భాస్కర్‌రెడ్డి, కృష్ణారెడ్డి, మైసయ్య తదితరులు పాల్గొన్నారు.

# నకిలీ టీచర్లపై విచారణ

కులకచర్ల, మే 29 : నకిలీ టీచర్లపై విచారణ నిర్వహిస్తున్నట్లు విచారణ అధికారి అబ్దుల్‌ఘనీ అన్నారు. బుధవారం కులకచర్ల మండల కేంద్రంలోని ఎంఈవో కార్యాలయంలో ముగ్గురు నకిలీ ఉపాధ్యాయుల వివరాలను సేకరించి వారిని పిలిపించి విచారణ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతంలో తప్పుడు ధ్రువీకరణపత్రాలు సృష్టించి ఉపాధ్యాయ ఉద్యోగం పొందారనే దానిపై ముగ్గురు ఉపాధ్యాయులు సస్పెండయ్యారు. బుధవారం జిల్లా విచారణ అధికారి అబ్దుల్‌ఘనీ కులకచర్ల ఎంఈవో కార్యాలయానికి వారిని పిలిపించి వివరాలు సేకరించారు. ఈ కార్యక్రమంలో ఎంఈవో అబీబ్ అహ్మద్ తదితరులు పాల్గొన్నారు.



కులకచర్ల ఎంఈవో కార్యాలయంలో విచారణ నిర్వహిస్తున్న జిల్లా విచారణ అధికారి అబ్దుల్‌ఘనీ

# నిధులున్నా.. నిర్మాణమేదీ ?

- అటకెక్కిన ఇబ్రహీంపట్నం ఫిష్‌మార్కెట్ పనులు
- రూ.2 కోట్లు కేటాయించిన గత ప్రభుత్వం
- పనుల ప్రారంభంలో కాంగ్రెస్ సర్కార్ నిర్లక్ష్యం
- రోడ్లపైనే చేపల అమ్మకాలు.. ఇబ్బందుల్లో ప్రజలు
- ఇప్పటికైనా స్పందించి మార్కెట్‌ను నిర్మించాలంటున్న మత్స్యకారులు





మార్కెట్ సౌకర్యం లేక రోడ్డుపైనే చేపలు విక్రయిస్తున్న మత్స్యకారులు



ఇబ్రహీంపట్నం సమీపంలో చేపల మార్కెట్ ఏర్పాటు కోసం గత ప్రభుత్వం వేసిన శిలాఫలకం

ఇబ్రహీంపట్నం, మే 29 : హైదరాబాద్ నగరంలోని రాంనగర్ తరహాలో ఇబ్రహీంపట్నం చెరువు సమీపంలో ఫిష్‌మార్కెట్ నిర్మించాలని గత ప్రభుత్వం సంకల్పించింది. జిల్లాలోని మత్స్యకారులతో పాటు నగరంలోని చేపల విక్రయదారులు ఇక్కడ అమ్ముకునేందుకు వీలుగా సౌకర్యాలు కల్పించాలని యోచించింది. అందుకోసం ఇబ్రహీంపట్నం చెరువు సమీపంలోని చేపపిల్లల పెంపకం కేంద్రం వద్ద ఫిష్ మార్కెట్ నిర్మించాలని పూనుకొని రూ.2 కోట్ల నిధులను సైతం కేటాయించింది. మార్కెట్ పనులకు అప్పటి మత్స్యశాఖ మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్ శంకుస్థాపన కూడా చేశారు. అనంతరం సాధారణ ఎన్నికలు రావడం.. ప్రభుత్వం మారడంతో ఫిష్‌మార్కెట్ పనులు అటకెక్కాయి.

## రోడ్లపైనే అమ్మకాలు..

మార్కెట్ సౌకర్యం లేకపోవడంతో మత్స్యకారులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. ఇబ్రహీంపట్నంతో పాటు తుర్కయాంజాల్, రాగన్నగూడ, బొంగ్లూర్, యాచారం, మాల్, తదితర ప్రాంతాల్లో రోడ్లపైనే చేపలను విక్రయించాల్సిన దుస్థితి నెలకొన్నది. దీంతో ఇటు వ్యాపారులు, అటు వాహనదారులు, పాదచారులు తీవ్ర అవస్థలు పడుతున్నారు. గత ప్రభుత్వం జిల్లావ్యాప్తంగా పెద్ద ఎత్తున చెరువుల్లో చేపపిల్లల పెంపకానికి శ్రీకారం చుట్టింది. నాలుగు కోట్ల పైచిలుకు చేపపిల్లలను మత్స్యశాఖ ఆధ్వర్యంలో ఆయా సొసైటీల పరిధిలోని చెరువుల్లో పెంపకానికి కేటాయించారు. పెంచిన చేపలను విక్రయించేందుకు ఒక మార్కెట్ ఉండాలనే ఉద్దేశంతో ఇక్కడ అన్ని హంగులతో ఫిష్‌మార్కెట్‌ను నిర్మించి కొనుగోలుదారులు, అమ్మకందారులకు సౌకర్యాలు కల్పించాలని భావించింది. అయితే కాంగ్రెస్ ప్రభుత్వం రాకతో ఫిష్ మార్కెట్ నిర్మాణం పెండింగ్‌లో పడింది. నిధులున్నా ఇప్పటికీ పనులను ప్రారంభించడంలేదు. ఇప్పటికైనా కాంగ్రెస్ సర్కార్ స్పందించి ఇబ్రహీంపట్నంలో మార్కెట్ సౌకర్యాన్ని కల్పించాలని మత్స్యకారులు, కొనుగోలుదారులు కోరుతున్నారు.



వెలవెలబోతున్న ఇబ్రహీంపట్నంలోని చేపల పెంపకం కేంద్రం

## ల్యాబ్ కూడా ఏర్పాటు చేయాలి..



ఫిష్ మార్కెట్ పనులను ప్రారంభించి త్వరితగతిన పూర్తి చేయాలి. గత ప్రభుత్వం ఇబ్రహీంపట్నంలో చేపల మార్కెట్‌తో పాటు ల్యాబ్‌ను ఏర్పాటుచేసేందుకు నిధులు కేటాయించింది. కానీ కాంగ్రెస్ సర్కార్ మార్కెట్ నిర్మాణంపై దృష్టి సారించడం లేదు. దీంతో ఈ ప్రాంతంలోని మత్స్యకారులమంతా తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నాం. ఇప్పటికైనా స్పందించి ఫిష్‌మార్కెట్‌తో పాటు ల్యాబ్‌ను కూడా ఏర్పాటు చేయాలి.

–గుంటి భీంరావు, జిల్లా మత్స్య సహకార సంఘం నాయకులు

## వెంటనే మార్కెట్ పనులను ప్రారంభించాలి..



గత ప్రభుత్వం మత్స్యకారుల సంక్షేమం కోసం ఎంతో కృషి చేసింది. ఉచితంగా చేపపిల్లలు పంపిణీ చేయడంతోపాటు పెంపకానికి అవసరమైన సౌకర్యాలు కల్పించింది. ప్రస్తుతం కాంగ్రెస్ ప్రభుత్వం మత్స్యకారులను పట్టించుకోవడంలేదు. ఇబ్రహీంపట్నం ప్రాంతంలో చేపల మార్కెట్ ఏర్పాటుకు గత ప్రభుత్వం నిధులు విడుదల చేస్తే.. ఈ ప్రభుత్వం పట్టించుకోవడం లేదు. వెంటనే చేపల మార్కెట్ పనులు ప్రారంభించాలి.

–గుంటి కిరణ్, మత్స్యకార సంఘం నాయకుడు